
# విశ్వాంతరాళంలో విజయయాత్ర

టీవిలో వారానికి ఒకసారి అంతరిక్షానికి సంబంధించిన ప్రోగ్రాములు ప్రసారం చేయడం మొదలుపెట్టారు. అనేక శక్తిమంతమైన టెలిస్కోప్‌లద్వారా తీసిన చిత్రాలతోపాటు, వాయేజర్, ఎక్స్‌ప్లోరర్ వంటి అనేక అంతరిక్షనౌకలు తీసిపంపిన ఫోటోలను కూడా జోడించి వాటిని ఎంతో అందంగా రూపొందిస్తున్నారు. అంతేకాదు అవసరానికి తగ్గట్లుగా అసలుకి సరియైన నకలు అన్నట్లు అద్భుతమైన సెట్టింగులుకూడా వేసి, చిత్రాలు, స్కెచెస్ గీసి, వీటన్నింటినీ కలిపి ఎంతో ఆసక్తికరంగా రూపొందించసాగారు. ఆ చిత్రనిర్మాతలు. వీటికితోడు అతి సులభమైన భాషతో అందరికీ అర్థమయ్యే విధంగా, ఏదో సైన్స్ పాఠం చెబుతున్నట్లు కాకుండా, చక్కని కథ చెప్తున్నట్లుగా ఉంటోంది ఆ వ్యాఖ్యానం. ఈ కారణాల మూలంగా ఈ కార్యక్రమాలు ఐదేళ్ళ బాలుర దగ్గర్నుంచి ఎనభైయ్యేళ్ళ వృద్ధులవరకు అందర్నీ ఒకేవిధంగా ఆకట్టుకోసాగాయి. చిత్రలహరి చిత్రమాల, చిత్రహార్ వంటి సినీపాటల కార్యక్రమాలు, వారాంతపు చిత్రాలూ అయినా చూడకపోవచ్చునుకాని ఈ ప్రోగ్రామ్స్‌ని మాత్రం ఎవరూ మిస్ కావడంలేదు. ఇవి రామాయణ్‌తో సమానంగానో అంతకు మించో ప్రాచుర్యాన్ని పొందాయి. ప్రసారం చేసే సమయంకూడా రాత్రి తొమ్మిది తర్వాత ఉండి అందరికీ సౌకర్యంగా ఉండడంతో, తప్పనిసరి అయితే తప్ప వాటిని ఎవరూ మిస్ కావడం లేదు. ఇటీవల కొన్ని కంపెనీలు 3-డి టెలివిజన్‌లను కూడా తయారుచేస్తున్నాయి. కళ్ళకి ప్రత్యేకమైన అద్దాలు పెట్టుకుని వాటిని చూస్తున్నారు. సాక్షాత్తూ తాము అంతరిక్షంలో పరిభ్రమిస్తున్నట్లో లేదా ఇతర గ్రహాలపై తిరుగాడుతున్నట్లో అనుభూతిని చెందసాగారు. ఇంక రంగుల టెలివిజన్లలో, అందులోనూ పెద్ద స్క్రీన్‌గల మంచి కంపెనీల వాటిలో వీటిని చూస్తుంటే కలిగే అనుభూతి వర్ణనాతీతం. ఈ ప్రోగ్రాములలో మొదట నక్షత్ర మేఘాలు (నెబ్యులే) గురించి, తర్వాత వాటిలోని పదార్థం నక్షత్రాలు, నక్షత్ర కూటాలుగా (గాలక్సీలు) ఎలా మారేదీ చూపించారు. నూలుకండె, పళ్ళెం, స్వస్థిక్ చక్రం, సుడులు వంటి వివిధ విచిత్ర ఆకారాలలో ఉండే గాలక్సీల ఫోటోలను చూపారు. ఓరియన్, ఆండ్రోమెడ వంటి అద్భుతమైన గాలక్సీల చిత్రాలను చూసారు.

గుత్తులు గుత్తులుగా ఉండే గాలక్సీలను (క్లస్టర్డ్ గాలక్సీస్) ఒత్తుగా దట్టంగా ఉండే నక్షత్రాల సమూహాలను (స్టార్ క్లస్టర్స్) ప్రదర్శించారు. అవన్నీ చూస్తుంటే అనంత విశ్వంలో విజయయాత్ర చేస్తున్నట్లే అనిపించింది.



నక్షత్రాల తర్వాత సూర్యుని గురించిన కార్యక్రమం వచ్చింది. అందులో సూర్యుని రూపం, దానినుంచి వెలువడే అగ్నికీలలు (సోలార్ ఫ్లేర్స్, ప్రామినెన్సెస్), సంపూర్ణ సూర్యగ్రహణం దృశ్యం. ఆ సమయంలో ఏర్పడే కరోనా, సూర్యుని మచ్చలు వంటి వాటిని గురించి ఎంతో వివరంగా మనోజ్ఞంగా చూపించారు.

సూర్యుని తరువాత గ్రహాలకు సంబంధించిన ప్రోగ్రామ్‌లు వచ్చాయి. వాటిలో బుధుడు, ఆ గ్రహంమీదున్న వలయ పర్వతాల (క్రేటర్స్) దృశ్యాలు, బుధునికీ చంద్రునికీ కొట్టవచ్చినట్లు పోలికలు, శుక్రుడు, ఆ గ్రహంమీది దట్టమైన వాతావరణం, అక్కడ నిత్యమూ సంభవిస్తుండే భయంకరమైన పెనుధూళి తుఫానులు వంటివి చూపించారు.

ఆ తర్వాత భూమిని గురించిన కార్యక్రమం వచ్చింది. ముందు "భూమిని గురించి కార్యక్రమం పెట్టాల్సిన అవసరం ఏముంది?" అనుకున్నారు చాలామంది. తీరా చూశాక "అబ్బా... మన భూమిలో ఇంతటి అద్భుతమైన అందాలున్నాయా?" అనుకుని ఆశ్చర్యపోయారు. ఉత్తర దక్షిణ ధృవాలు, అక్కడ ఏర్పడుతుండే విచిత్రమైన ధృవకాంతులు అరోరా భోరియాలిన్, అరోరా ఆస్ట్రాలిస్ సహారావంటి గొప్ప ఎడారులు, అరిజోనాలోని గ్రాండ్ కాన్యాన్ వంటి అద్భుతమైన లోయలూ వంటివి చూసి పులకరించిపోయారు.

భూమి తర్వాత వచ్చింది అంగారకగ్రహం ఈ రెండింటికీ ఉన్న పోలికలూ, మంచుతో కప్పబడిన

ధృవాలూ, విశాలమైన ఎర్రని మైదానాలూ, ఎత్తయిన ఎర్రని కొండలు, పెద్దపెద్ద లోయలతో ఎంతో మనోజ్ఞంగా ఉంది అంగారక గ్రహం. తర్వాత బృహస్పతి గ్రహం గురించి చూపారు. దానిమీద విభూతి పిండి కట్లులాగా ఉండే మూడు ప్రత్యేకమైన ప్రాంతాలూ, రెండింటిమధ్య నున్న బ్రహ్మాండమైన ఎర్రని మచ్చ, ఎంతో మనోజ్ఞంగా కనిపించాయి.

తర్వాత వచ్చింది సౌర కుటుంబంలోని అత్యంత అందమైన శని గ్రహం. దాని బృహత్పరిమాణంతోపాటు దానికి ఉన్న మూడు వలయాలు సంభ్రమాన్ని కల్పించాయి.

తర్వాత యురేనస్, నెప్ట్యున్, ప్లూటో వంటి సుదూర గ్రహాల గురించి సూక్ష్మంగా తెలియజేశారు.

ఆ తర్వాత తోకచుక్కల గురించిన కార్యక్రమం వచ్చింది. తోకచుక్కలు, వాటి తలలు, తోకలతోపాటు, వాటి వివిధ ఆకారాలను చూపించారు. హాలీ, కోహాటక్ తోకచుక్కలపై ప్రత్యేకమైన కార్యక్రమాలను చూపించారు. వాటిలో చూపించిన దృశ్యాలు సంభ్రమాశ్చర్యానందాలను కలిగించేవిగా ఉన్నాయి.

ఇవన్నీ అయ్యాక ఉపగ్రహాల కార్యక్రమంలో భాగంగా ముందుగా చంద్రుని గురించి సవివరంగా చూపించారు.

చంద్రుడు భూమికి అత్యంత సమీపంగా ఉన్న ఇతర గోళం. పైగా మానవుడు తొలిసారిగా 1969లో కాలుమోపిన పరలోకం. దీనిగురించి మనకు తెలిసినంతగా, అంత వివరంగా, వేరే ఏ ఇతర గోళం గురించీ తెలియదు. బ్రహ్మాండమైన టెలిస్కోప్‌లద్వారా తీసిన చిత్రాలేకాక దానిపై దిగుతూ, దిగిన తర్వాత, వ్యోమగాములు తీసిన చిత్రాలుకూడా ఎన్నో ఉన్నాయి. వీటన్నింటితో అద్భుతమైన కార్యక్రమాలలో తలమానికంగా ఉన్నటువంటిదానిని నిర్మించారు.

చంద్రునిమీద ఎత్తయిన పర్వతాలు, వలయ పర్వతాలు (క్రేటర్స్), లోయలు, మైదానాలు, చీలికలు, కిరణాలు (రేస్)వంటివాటిని సవివరంగా చూపించారు. వీటికితోడు చంద్రునిమీద కాలూనడానికి, అంచెలంచెలుగా అపోలో మిషన్‌లద్వారా జరిగిన కృషిని ప్రత్యేకంగా చూపించారు. వీటిలో మొదటగా 1969లో అపోలో-11లో వెళ్ళిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ వగైరాలు చంద్రునిమీద దిగి జయకేతనాన్ని పాతడం చూపించారు. అక్కడ వారి పాదముద్రలు, జరిపిన విన్యాసాలు చూపించారు. తర్వాత జరిగిన అపోలో-12 యాత్ర విజయవంతంగానే జరిగింది. దానిలో ప్రత్యేకత ఏమీ లేదు. అయితే ఆ తర్వాత జరిగిన అపోలో-13 యాత్ర విఫలమవడమే కాకుండా, పరమ భయంకరమైన అనుభవంగా మారింది. అందువల్ల దానిని గురించి సెన్సేషన్‌లో ముంచెత్తే చిత్రాన్ని నిర్మించారు. ఇందుకుగాను స్వతహాగా అందులో వెళ్ళిన అంతరిక్ష యాత్రికులను తీసుకున్నారు. వారితో కొత్తగా షూటింగ్ జరిపీ, వారు తీసిన చిత్రాలను కొన్నింటిని కలిపీ ఎంతో ఉత్తేజకరమైన చిత్రాన్ని నిర్మించారు. దానికి 'ది డ్రెడ్‌ఫుల్ ఎపిసోడ్ ఆఫ్ అపోలో-13' అని పేరుపెట్టారు. (అపోలో-13 భయానక ఉదంతం). ఈ కార్యక్రమం గురించి ముందుగా బాగా ప్రచారం చేయడంతో దానిని చూడడానికి అందరూ వేయి కళ్లతో ఎదురుచూడసాగారు.

* * * *

రాత్రి 9.50 అయింది.

టి.వి.లో ఇంగ్లీషు వార్తలు అయిపోయాయి.

అపోలో-13 కార్యక్రమం కోసం అందరూ ఉగ్గబట్టుక్కూర్చున్నారు.

ప్రోగ్రాం మొదలయింది.

ముందుగా అపోలో యాత్రలగురించి స్థూలంగా చెప్పి, అపోలో-13 లక్ష్యాలను వివరించాడు వ్యాఖ్యాత.

పశ్చిమదేశాలవారికి 13 చాలా దురదృష్టమైన సంఖ్య. ఆ సంఖ్య అంటే చాలా భయపడ్తారు వారు. 13 సంఖ్యని దేనికి ఉంచడానికీ ఇష్టపడరు. అనేక హోటళ్లలో గదులకి నంబర్లను కేటాయించేటప్పుడు ఈ సంఖ్యని వదిలేసి 12 తర్వాత 14 రాసేస్తారు. ఒకవేళ 13 నెంబరు ఉంచితే ఆ గదిలో దిగడానికి ఎవరూ సాహసించారు. ప్రయాణాలూ, ముఖ్యమైన పనులూ 13వ తారీఖున మానుకుంటారు. అంతగా ఉంటుంది. 13 సంఖ్య అంటే వారి భయం. ఈ భయానికి తగ్గట్టుగానే, అపోలో-13 యాత్రకి అదినుంచి అరిష్టాలే ఎదురయ్యాయి. దాని నిర్మాణం దగ్గర్నుంచి, అంతరిక్షంలోనికి పంపడంవరకూ అడుగడుగునా ఇబ్బందులే.

కార్యక్రమం రాకెట్‌ను పేల్చడంతో మొదలైంది. ప్రేల్చిన వెంటనే బ్రహ్మాండమైన మంటలను ఎగజిమ్ముతూ క్షణాల్లో రాకెట్ అంతరిక్షంలోకి దూసుకుపోయింది.

భూమిని చుట్టూ పరిభ్రమిస్తూ నెమ్మదిగా భూమికి దూరం అవుతోంది రాకెట్. సెకండ్ స్టేజిలో రాకెట్‌లోని దిగువభాగం విడిపోయింది. బరువు తగ్గడంతో రాకెట్‌లోని మిగిలిన భాగం మరింత వేగాన్ని పుంజుకుంది. మరికొంత సమయానికి రాకెట్‌లోని మరో భాగంకూడా విడిపోయింది. దాంతో కేవలం అపోలో-13 అంతరిక్ష నౌక మాత్రం మిగిలింది. అది మరికొన్నిసార్లు భూమిచుట్టూ తిరిగి చివరకు భూమి ఆకర్షణశక్తిని ఛేదించుకుని అంతరిక్షంలోకి దూసుకుపోయింది.

అటు తర్వాత అంతరిక్షంనుంచి భూమి కనిపించే దృశ్యాలను అద్భుతంగా చూపించారు.

బ్రహ్మాండమైన సముద్రాలు, ధృవాల దగ్గర మంచు, దట్టమైన మేఘాలు, మధ్యమధ్య భూభాగాలు- ఇలా ప్రతిదీ కన్నుల పండువగా చిత్రీకరించారు. భూభాగాలలో అమెరికా, ఇండియా, చైనా వంటివి వచ్చినపుడు వాటిని క్లోజప్‌లో చూపించారు. ఇంట్లో కూర్చుని సొంత దేశాన్ని, యావత్ ప్రపంచాన్నీ ఒకే కంట చూడగలగడం జీవితంలో మరువలేని మధురానుభూతి.

అంతరిక్ష నౌకలో ముగ్గురు యాత్రికులు ఉన్నారు. వారు ప్రత్యేకమైన దుస్తులు ధరించారు. రకరకాల యంత్రాలతో పనిచేస్తున్నారు. మధ్యమధ్య భూకేంద్రంతో మాట్లాడుతున్నారు వారు. ఒకచోటనుంచి మరో చోటకి వెళ్ళాలంటే అతి సులువుగా గాలిలో తేలుతూ వెళ్తున్నారు. వారు జగ్‌లోనుంచి నీటిని పంచితే క్రిందికి పడడంలేదు. నీళ్ళు త్రాగాలన్నా, ఆహారం తినాలన్నా అంతే. ప్రత్యేకమైన పద్ధతిలో, ప్రత్యేక పరికరాలతో చేయాల్సిందే. ఆసక్తిరేకెత్తించడంకోసం ఇటువంటి దృశ్యాలను ఆ చిత్రంలో పొందుపర్చారు.

కొంచెంసేపట్లో చంద్రుడు అంతకంతకీ దగ్గరవుతున్న దృశ్యాలు వచ్చాయి. అంతరిక్షంలోంచి వీక్షిస్తుంటే చంద్రుడు అద్భుతంగా మెరిసిపోతూ, వర్ణింపశక్యం కాని అందాలను వలికిస్తున్నాడు.

ఇంతలో అపోలో యాత్రికుల ముఖాలలో ఆందోళన ప్రస్ఫుటంగా కనిపించింది. కెప్టెన్ ఆందోళన స్వరంతో "గ్రౌండ్ కంట్రోల్.... దిసీజ్ ఫ్రం అపోలో-13" అని వైర్‌లెస్ ద్వారా అన్నాడు.

"ఎస్. గ్రౌండ్ కంట్రోల్ హియర్" అంటూ సమాధానం వచ్చింది.

"చూడండి. అంతరిక్ష నౌకలో ఏదో లోపం ఏర్పడింది. అది చంద్రునిదిశగా పోకుండా, దానిచుట్టూ తిరుగుతూ ఉండే కక్ష్యలోకి ప్రవేశించింది" అన్నాడు కెప్టెన్.

"ఉండండి. దానికి కరెక్షన్ ఇస్తాను. మీ నౌక వెళ్తున్న డైరెక్షన్, యాంగిల్ మొదలైన వివరాలన్నీ ఇవ్వండి" అన్నాడు గ్రౌండ్ కంట్రోలర్.

అవసరమైన వివరాలన్నీ ఇచ్చాడు కేప్టెన్.

క్రిందనుంచి అంటే భూమిమీద గ్రౌండ్ కంట్రోల్‌నుంచి వైర్‌లెస్ సంకేతాల రూపంలో కరెక్షన్స్ ఇచ్చారు. కాని నౌకలోని యంత్ర పరికరాలలో ఏదో లోపం ఏర్పడడంతో అది ఆ సంకేతాల్ని స్వీకరించలేదు.

"మైగాడ్. ఇది మీ సంకేతాల్ని స్వీకరించడంలేదు. మేము ఇప్పుడు అంతరిక్షంలో బందీలం అయిపోయాం. ఈ అపోలో-13 అంతరిక్షనౌక చంద్రునికి శాశ్వతంగా ఉపగ్రహంగా మారిపోతుంది. మా ముగ్గురి ప్రాణాలు కొద్దిరోజుల్లో పోతాయి. మా శవాలతో ఈ నౌక నిత్యమూ చంద్రునిచుట్టూ తిరుగుతుంటుంది" అన్నాడు కెప్టెన్.

"ధైర్యం సడలకండి. మేము ఇక్కడినుండి అన్నివిధాలా ప్రయత్నించి దానికి కరెక్షన్ ఇస్తాం. మీరుకూడా లోపం ఎక్కడేర్పడిందో తెలుసుకోడానికి ప్రయత్నించండి" అన్నాడు గ్రౌండ్ కంట్రోలర్.

"మేము ముగ్గురం అదే పనిమీదున్నాం. ఒకవేళ మా నౌక చంద్రునికి ఉపగ్రహంగా మారకపోయినా, దాని ఆకర్షణశక్తి మూలంగా, కొద్దిరోజుల్లోనే దానిని ఢీకొని ముక్కలు ముక్కలైపోవచ్చు. అపుడు నౌకముక్కలతోపాటు మా శవాల ముక్కలుకూడా చంద్రునిమీద చెల్లాచెదురుగా పడతాయి. ఏమైనా మేము బ్రతికి బయటపడేమాట అనుమానం అందుకే భూమికీ, మీ అందరికీ గుడ్‌బై చెప్తున్నాం" అన్నాడు మరో యాత్రికుడు.

ఆ తర్వాత అంతరిక్ష నౌకలోని యంత్రాలను, యాత్రికులు సరిచూసుకుంటున్నట్లూ, గ్రౌండ్ కంట్రోల్‌వారు, వారి ప్రయత్నాలను వారు చేస్తున్నట్లూ చూపించారు. మూడు రోజులు మృత్యువుతో హోరాహోరీగా పోట్లాడి, చంద్రాకర్షణ కబంధ హస్తాలనుంచి బయటపడి అపోలో-13 భూమివైపు ప్రయాణం సాగించింది. చివరికి పసిఫిక్ మహాసముద్రంలోకి దిగింది. అంతరిక్ష యాత్రికులు ముగ్గురూ క్షేమంగా బయటకు వచ్చారు.

ఆ మూడు రోజులూ ప్రపంచంలోని ప్రతివ్యక్తీ ఎంతో ఆందోళన పొందారు. ఒక్క అంశంపై ప్రపంచం యావత్తూ దృష్టిని నిలిపిన సంఘటన ప్రపంచంలో అది ఒక్కటే.

ఈ కార్యక్రమం వచ్చిన అరగంటసేపూ ప్రేక్షకులు అందరూ కుర్చీలకు అంటుకుపోయారు. దడదడలాడే గుండెలతో చూశారు. అంత ఉద్విగ్నంగా చిత్రించారు దాన్ని.

కార్యక్రమాన్ని ముగిస్తూ, అంగారకునికీ, బృహస్పతికీ మధ్య ఉన్న వేలాది అల్పగ్రహాలలో (ఆస్టరాయిడ్, 'సెరిస్', 'వెస్టా' వంటి వాటిమీద శాశ్వత స్థావరాన్ని నెలకొల్పి అక్కడనుంచి అంగారకుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో వంటి సుదూర గ్రహాలను పరిశోధించడానికి ప్రయత్నాలు

జరుగుతున్నాయనీ వాటిని గురించిన కార్యక్రమం ఆ సిరీస్‌లో భాగంగా ప్రసారం చేస్తామనీ చెప్పారు.

అంతకు ముందు నక్షత్రాలూ, గ్రహాల గురించి చూసిన కార్యక్రమం ఒకయెత్తు. ఈ అపోలో-13 కార్యక్రమం ఒకఎత్తు అంటున్నారు ప్రేక్షకులు.

ప్రపంచం 21వ శతాబ్దంలోకి దూసుకుపోయింది. అంతరిక్ష శాస్త్రం ఎంతగానో అభివృద్ధి చెందింది. చంద్రునిమీద కాలనీలు కట్టి శాస్త్రజ్ఞులు బృందాలు బృందాలుగా ఉంటూ పరిశోధనలు చేస్తున్నారు. అంతరిక్ష శాస్త్రంలో అమితంగా అభివృద్ధిని సాధించిన భారతదేశం కూడా అమెరికా, రష్యా, బ్రిటన్, జపాన్‌వంటి అత్యంత అభివృద్ధి చెందిన దేశాల సరసన ఉండి అన్నిరకాల అంతరిక్ష పరిశోధనలలోనూ పాలుపంచుకుంటోంది.

అంగారక గ్రహంమీద మానవుడు కాలూని వచ్చాడేకాని ఆ గ్రహం మీద సమగ్రమైన పరిశోధనలు జరగలేదు. బృహస్పతి మీదున్న ఎర్రనిమచ్చ, శనిగ్రహపు వలయాలు వంటివి ఇంకా అంతుచిక్కని రహస్యాలు గానే ఉండిపోయాయి. బృహస్పతికి ఉన్న గానిమీడ్, శనికి ఉన్న టైటాన్ వంటి ఉపగ్రహాల మీద వాతావరణం, నీరు ఉన్నాయి. వాటిమీద జీవం ఏదో రూపంలో ఉంటుందని శాస్త్రజ్ఞుల విశ్వాసం. వీటన్నినీ సమగ్రంగా పరిశోధించాలంటే కేవలం అంతరిక్ష నౌకలను పంపితే చాలదు. వాటిని సమీపించి స్థిరమైన అంతరిక్షపరిశోధనాలను నిర్మించి అక్కడినుంచి నిత్యమూ పరిశోధనలు జరుపుతుండాలి.

భూమి తర్వాత ఉన్నది అంగారక గ్రహం.

దాని తర్వాత ఉన్నది బృహస్పతి గ్రహం.

ఈ రెండింటి మధ్యన కొన్నివేల అల్పగ్రహాలు ఉన్నాయి. వీటిని "ఆస్టిరాయిడ్స్" అని లేక "ప్లానిటాయిడ్స్" అని అంటారు. శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం ఒకప్పుడు అంగారకునికీ, బృహస్పతికీ మధ్యన భూమివంటి ఒక పెద్ద గ్రహం ఉండేది. అది ఏ కారణం చేతనో ప్రేలిపోయి కొన్నివేల ఉపగ్రహాలుగా మారిపోయింది. చిన్నచిన్న ముక్కలు కోటానుకోట్ల ఉల్కలుగా మారాయి. ఇవి భూమిని సమీపించినప్పుడు భూమి ఆకర్షణ శక్తిమూలంగా భూమిమీదపడ్తూ వాతావరణంలో ప్రవేశిస్తాయి. అక్కడ ఆ రాపిడికి మండిపోయి నేలమీద పడిపోయినట్లు అనిపిస్తాయి. వీటినే పాతకాలంవాళ్ళు నక్షత్రాల తోకలు తెగిపడ్డాయంటుంటారు. చిన్న ఉల్కలయితే వాతావరణంలో మండిపోతాయి. పెద్దవైతే మండుతూనే వచ్చి నేలమీద పడ్తాయి. మరీ పెద్దదైతే అమిత వేగంతో నేలను ఢీకొంటాయి. ఫలితంగా పెద్ద పెద్ద గోతులు, ఓ మాదిరి భూకంపాలు ఏర్పడతాయి. అయితే ఇట్టివి అతి అరుదుగా సంభవిస్తాయి. మహారాష్ట్రలోని బుల్డానా జిల్లాలోని సరస్సు ఈ విధంగా ఏర్పడిన గోయి నీటితో నిండగా ఏర్పడినదే. అంగారక గ్రహాన్ని దాటి ప్రయాణం చేయవలసిన అంతరిక్ష నౌకలకే ఈ ఉల్కల, అల్పగ్రహాల తాకిడి ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది. అంతరిక్ష నౌకలను పంపేప్పుడు సాధ్యమైనంతవరకూ ఈ అల్ప గ్రహాల కక్ష్యకు దూరంగా ఉండేటట్లు వాటి మార్గాన్ని నిర్దేశిస్తారు. చిన్న ఉల్కలైతే అమిత వేగంతో వచ్చి అంతరిక్ష నౌకను ఢీకొంటే ఇంక అంతేసంగతులు. అంతరిక్ష నౌక తుక్కుతుక్కయి అడ్రసు లేకుండా పోతుంది. ఇట్టి ప్రమాదాలను నివారించేందుకు రాడార్ ద్వారా ఎప్పటికప్పుడు నౌకను సమీపిస్తున్న వస్తువులను గురించి సమాచారం తెలిపే ఏర్పాటు ఉంటుంది. అలాగే ఆ ఉల్కలు గుద్దుకోనీకుండా

అంతరిక్షంలోనే పేల్చేసే, లేదా వాటి దిశ, గతి మార్చే ఆటోమాటిక్ రిపెల్లర్స్ ఉంటాయి. ఇటువంటి జాగ్రత్తలు ఎన్నో తీసుకునే కారణంగా, అంతరిక్ష నౌకలకి ప్రమాదాలు ఎప్పుడో కాని సంభవించవు.

అంగారకునికీ, బృహస్పతికీ మధ్యనున్న అల్పగ్రహాలలో అనువైన దానిమీద స్థావరం ఏర్పరచుకుంటే అక్కడినుంచి అంగారక గ్రహాన్నేకాక, బృహస్పతి, శనివంటి సుదూర గ్రహాలను ఎంతో బాగా పరిశోధించవచ్చు. అంతరిక్ష పరిశోధనలలో అనేక దేశాలు పాల్గొనుటుండటంవల్ల అంతర్జాతీయ అంతరిక్ష సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నాయి ప్రపంచ దేశాలు. ఇందులో సభ్యత్వం ఉన్న ప్రముఖ దేశాలలో భారతదేశంకూడా ఒకటి. ఈ సంఘాలన్నీ తమ అంతరిక్ష పరిశోధనలలో పరస్పరం సహకరించుకుంటాయి. ఈ సంఘం "వెస్టా" అనే అల్ప గ్రహం మీద స్థావరాన్ని ఏర్పరచుకుని పరిశోధన శాలను నిర్మించింది. ఈ అల్పగ్రహం మీద వాతావరణం, నీరు వంటివి ఏవీ లేనందువల్ల ఏ ఇబ్బందీ లేకుండా, టెలిస్కోప్, స్పెక్ట్రోస్కోప్ వంటి సాధనాలతో గ్రహాల్నీ, నక్షత్రాల్నీ, నిరాటంకంగా పరిశోధిస్తుండవచ్చు. ఈ అల్పగ్రహం మీద కృత్రిమంగా కాలనీని నిర్మించుకుని భూవాతావరణాన్నీ, నీటినీ, ఇతర అవసరాలనూ కృత్రిమంగా ఏర్పరుచుకున్నారు. నెలానెలా స్పేస్‌షటిల్ ద్వారా కావలసిన పదార్థాలూ, వస్తువులూ వస్తుంటాయి. వీటితోపాటే శాస్త్రజ్ఞుల బృందాలూ వస్తుంటాయి. కొత్త బృందంరాగానే పాత బృందం అదే స్పేస్ షటిల్‌లో తాము సేకరించిన సమాచారాన్ని తీసుకుని భూమికి వెళ్ళిపోతుంటుంది. ఈ వెస్టా కేంద్రం నుంచి శాస్త్రజ్ఞులు అనేక అద్భుత విషయాలను కనుగొంటుంటారు.

* * * *

భూమినుంచి సరికొత్త బృందంతో స్పేస్ షటిల్ వెస్టా కేంద్రానికి బయలుదేరింది. ఇందులో ముగ్గురు సభ్యులున్నారు. వారు ముగ్గురూ భారతీయులే. వారు డాక్టర్ మధుకర్, ప్రొఫెసర్ మూర్తి, డాక్టర్ రావ్‌లు. మధుకర్, శ్రీహరికోటలో ఉన్న షార్ అంతరిక్ష కేంద్రంలో ఇంజనీర్. మూర్తి బెంగుళూరులోని ఇస్రో కేంద్రంలో సైంటిస్ట్. డాక్టర్ రావ్ అహమదాబాద్‌లోని భూకేంద్రంలో సైంటిస్ట్. ముగ్గురూ వారివారి రంగాలలో ఆరితేరినవారు. ముగ్గురూ కూడా ఖగోళ శాస్త్రంలో మంచి ప్రావీణ్యం ఉన్నవారు. అయితే వారి ముగ్గురికీ అంతరిక్ష యానం చేయడం అదే మొదటిసారి. అలాగని నౌకను నడపడంలో వారికి ఇబ్బందులు ఏవీలేవు. ఎందుకంటే వారు ముగ్గురూ అందులో సమగ్రమైన శిక్షణని పొందారు.

అంతరిక్ష నౌకలో ప్రయాణం వారికి విచిత్రమైన, అలౌకికమైన అనుభూతిని కలిగిస్తోంది.

అతి విశాలంగా, దిక్కులనన్నింటినీ కమ్ముకుని ఉన్నట్లుండిన భూమి చూస్తుండగా కుంచించుకునిపోయి గోళంగా మారడం, మరువలేని మధురానుభూతి.

రోజులూ, వారాలూ గడుస్తున్నకొద్దీ భూమి అంతకంతకీ చిన్నదైపోతోంది. బక్కలాగుండిన అంగారకుడు అంతకంతకీ పెద్దగా కనిపించసాగాడు. బాట్‌మింటన్ బాల్ పరిమాణంలో ఉంటుండిన బృహస్పతి ఫుట్‌బాల్ పరిమాణంలో కనిపించసాగాడు. నల్లని ఆకాశంలో, చాందినీకి వ్రేలాడగట్టిన పాదరసం బుడ్లలాగా మెరిసిపోతున్నాయి. తారకలు భూమినుంచి చూస్తే వాతావరణం కాంతికిరణాలను చెదరగొట్టే కారణంగా, ఆకాశం నీలంగా కనిపిస్తుంది. సూర్యునికాంతి అన్నివైపులా ప్రసరించడంవల్ల, పగటిపూట నక్షత్రాలు కనిపించవు. కాని అంతరిక్షంలో పగలూ, రాత్రి అంటూ ఉండదు. అంతా చిమ్మచీకటి. అందులో

నక్షత్రాలూ, సూర్యుడూ ఉజ్వలంగా మెరుస్తూ కనిపిస్తుంటాయి. భూమిమీద వాతావరణం మూలంగా, నక్షత్రాలు మిణుకుమిణుకుమంటున్న భ్రమ కలుగుతుంది. అంతరిక్షంలో వాతావరణం ఉండనందువల్ల నక్షత్రాలూ, ఎలక్ట్రిక్ బల్బ్‌ల్లా మెరుస్తుంటాయి.

అంతరిక్షంలోని ఆ ముగ్గురికీ ఇవన్నీ విచిత్రానుభూతులే. అంతరిక్ష నౌక అంగారక గ్రహాన్ని దాటింది.

కొద్దివారాలలో అల్పగ్రహాల ప్రాంతంలో ప్రవేశించింది. అనేక చిన్న చిన్న ఉల్కలు దానివైపు దూసుకుంటూ వచ్చాయి కాని నౌకకున్న ఆటోమాటిక్ రిపెలెంట్‌లు వాటిని ఎప్పటికప్పుడు ధ్వంసం చేస్తూ వచ్చాయి.

అంతరిక్ష నౌక ఇంకొక్క వారంలో వెస్టాని చేరుతుంది.

ఆరోజు అనుకోని ఉత్పాతం జరిగిపోయింది.

సుమారు పది అడుగుల వ్యాసం ఉన్న ఒక ఉల్క అమిత వేగంతో అంతరిక్ష నౌకవైపు వస్తోంది.

అంత పెద్ద ఉల్కల్ని రిపెల్లెంట్‌లు ఏమీ చేయలేవు.

అప్పుడు ఆటోమేటిక్‌గా, దానిని నౌకనుంచి ప్రేల్చివేస్తారు. లేదా అంతరిక్ష నౌకని ప్రక్కలకి కాని, పైకికాని, క్రిందకి కాని జరిపి, డాష్ అయ్యే ప్రమాదాన్ని నివారిస్తారు. అవి తప్పిపోయాక తిరిగి అవసరమైన మార్గంలో ప్రవేశపెడ్తారు. అయితే అకస్మాత్తుగా అంతరిక్ష నౌకలో ఏదో లోపం ఏర్పడింది. ఉల్కని ప్రేల్చివేసే ఆటోమేటిక్ మిసైల్ విడుదల కాలేదు.

ఇంక మిగిలిన మార్గం, నౌక మార్గం తప్పించడమే.

ఆ ప్రయత్నం చేస్తుండగానే, నౌక కొంత జరుగుతుండగానే ఆ ఉల్క వచ్చి అంతరిక్ష నౌకని గుద్దేసింది. అయితే అప్పటికే నౌక కొంతమేరకు జరిగి ఉండటంతో ఆ తాకిడి ఒక మూలగా, కొంత భాగానికి తగిలింది. దాంతో ఆ భాగం విడివడి, అంతరిక్షంలో ఎటో దూసుకుపోయింది.

ఆ అదురుకి స్పృహతప్పిపడిపోయారు మధుకర్, మూర్తి, రావులు.

వారికి తెలివి వచ్చేసరికి కొన్ని గంటలు పట్టింది.

తెలివి వచ్చాక కూడా వెంటనే లేవలేకపోయారు.

మానసికంగానూ, శారీరకంగానూ అంతగా నీరసించిపోయారు. తర్వాత నెమ్మదిగా లేచారు.

ఆ ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయేకాని పెద్ద దెబ్బలేవీ తగలలేదు.

లేచి నౌక పరిస్థితిని పరిశీలించారు.

నౌకలో సగభాగం విరిగిపోయి, విడిపోయి ఎటో వెళ్ళిపోయింది.

అదృష్టవశాత్తు ఆ నల్గురూ క్షేమంగా ఉన్న భాగంలో ఉన్నారు. అయితే విడిపోయిన భాగంలోనే రాడార్, వైర్‌లెస్ ఎక్విప్‌మెంట్ రెట్రో రాకెట్స్ మొదలయినవి ఉన్నాయి. రెట్రోరాకెట్లు, అంతరిక్ష నౌకగోళం మీద దిగేటప్పుడు దూసుకువెళ్ళి గుద్దుకోకుండా దాని వేగాన్ని తగ్గించి నెమ్మదిగా దిగేట్లు చేస్తాయి. ఇప్పుడు ఇవన్నీ లేకపోవడంతో అంతరిక్ష నౌకకి భూమితోకాని, వెస్టామీదున్న కేంద్రంతోకాని సంబంధం పూర్తిగా తెగిపోయినట్లయింది. అంతరిక్షంలో జరిగిన ప్రమాదం గురించి వారికి తెలిపే అవకాశం లేదు.

తెలిసే అవకాశమూ లేదు.

"మైగాడ్....ఇప్పుడు మనం పూర్తిగా అంతరిక్షంలో బందీలం అయిపోయాం. మెసేజి పంపే అవకాశం లేదు. భూ కేంద్రంకాని, వెస్టా కేంద్రంకాని, మన దగ్గర్నుంచి రోజువారీ సందేశాలు అందకపోవడం వల్ల మనకేదో జరిగిందని తెలుసుకోవాల్సిందే..." అన్నాడు డాక్టర్ మూర్తి.

"ప్రమాదం జరిగిందని తెలుసుకోగలరే కాని ఎక్కడ జరిగిందో తెలుసుకోవడం చాలా కష్టం. తీరా వారు తెలుసుకుని మన కోసం రెస్క్యూషిప్‌ని పంపి, అది వచ్చేసరికి, మనం ఎవ్వరం ప్రాణాలతో ఉండం' ' అన్నాడు రావు.

"ఇప్పుడు మనం కేవలం అదృష్టపు దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి వున్నాం. నౌకలోని మెకానిజం అంతా బాగా దెబ్బతింది. నౌక ఎటుపోతోందో తెలియని పరిస్థితి ఆ ఉల్క అదురుకి నౌక మార్గం మారిపోయి ఉండవచ్చు. ఇదిలాపోతూ ఏ అల్పగ్రహాన్ని, గ్రహాన్నో, ఉపగ్రహాన్నో సమీపించి సూటిగాపోయి గుద్దేసుకుని ముక్కలుముక్కలయిపోవచ్చు. కాని అప్పటికి మనం ఎవ్వరం బ్రతికి ఉండం" అన్నాడు మధుకర్.

"గ్రుద్దుకుంటుందో, ఏ గ్రహానికైనా ఉపగ్రహంగా మారుతుందో ఏం చెప్పగలం? అంతా అప్పటి పరిస్థితిని బట్టి ఆధారపడి ఉంటుంది..." అన్నాడు మూర్తి.

"అపోలో - 13 యాత్రికులకి ఏర్పడిన పరిస్థితే ఇప్పుడు మనకీ ఏర్పడిందన్నమాట. కారణాలు వేరైనా వారి నౌకకీ, మననౌకకీ కూడా లోపం ఏర్పడింది. అయితే ఒక్కటే తేడా. వారికి భూమితో సంబంధాలు పోలేదు. మనకి అందరితోనూ సంబంధాలు పోయాయి" అన్నాడురావు.

"ఇప్పుడు మన పరిస్థితి ఏమిటో ఖచ్చితంగా తెలుసుకోవాలి. అప్పుడే ఏదైనా పరిష్కారం కనుగొనడానికి అవకాశం ఏర్పడుతుంది. అంతరిక్షంలో నిరాశతో దిక్కులేని చావు చచ్చే బదులు కడకంటూ పోరాడుతూ వీరమరణం పొందుదాం రండి. నౌక అంతా కలియచూసివద్దాం...." అంటూ లేచాడు మధుకర్.

అతని వెంట మిగిలిన ఇద్దరూ కూడా లేచారు.

ఆ అంతరిక్ష నౌకలోని రెండు విభాగాలను వేర్వేరుగా నిర్మించి ఆ రెండింటినీ కలిపారు. ఒక భాగంలో వైర్‌లెస్ సెట్, కంట్రోలింగ్ పరికరాలు. రాడారు,కంప్యూటర్‌లు కొన్ని వున్నాయి. ఇవికాక గోడౌన్‌లాంటి దానితో, యాత్రికులకి అవసరమైన ఆహారపదార్థాలతోపాటు వెస్టాకేంద్రంలో దింపవలసిన ఆహారపదార్థాలు, శాస్త్రీయ సామగ్రి, ఆక్సిజన్ సిలిండర్‌లు ఉన్నాయి. ఈ భాగమే ఉల్క తాకిడికి మొత్తం విరిగిపోయి తుక్కుతుక్కయి అంతరిక్షంలో ఎక్కడికో వెళ్ళిపోయింది.

ఇంక రెండోభాగంలో నిత్యావసరాలకి సరిపోయే ఆహారపదార్థాలు,గాలి ఉన్నాయి. కొన్ని కంప్యూటర్ వంటి యంత్రాలు ఉన్నాయి. అదృష్టవశాత్తు ఈ భాగం అదరిందే కాని దెబ్బతినలేదు. ఈ విభాగానికి ఆనుకుని లోహపు గోడలతో చేసిన పెద్ద వాటర్‌టాంక్ ఉంది. దానిలో నీటిని వెస్టామీదున్న శాస్త్రజ్ఞుల అవసరాల కోసం తీసుకువెడ్తున్నారు. వీరికి అవసరమైన నీటిని ఒక టాప్‌ద్వారా తీసుకునే ఏర్పాటుంది. అక్కడున్న యంత్రాలలో రాకెట్ గతిని, దిశను చూపించేది మాత్రం బాగుంది. మిగిలినవి దెబ్బతిన్నాయి.

అంతరిక్షనౌకలో మిగిలిన ఆ భాగాన్ని నిశితంగా పరిశీలించి వచ్చాక కుర్చీలలో కూలబడ్డారు ముగ్గురూ.

"అబ్బాయి. ఇప్పుడు ఇందులో ఉన్న నీరు మన ముగ్గురికే అయితే ఏడాదిపాటు సరిపోతుంది. ఆహారపదార్థాలు పదిరోజులకి సరిపోతాయి. జాగ్రత్తగా వాడుకుంటే ఇంకో పదిరోజులు రావచ్చు. కానీ ఆ అవసరం రాదులే. ఎందుకంటే ఇప్పుడు మనకి అందుబాటులో వున్న గాలి మూడురోజులు వరకే సరిపోతుంది. ఎట్టిపరిస్థితులలోనూ అందులో వున్న ఆక్సిజన్ నాలుగోరోజు నాటికి ఖర్చయిపోవటం ఖాయం' అన్నాడు మూర్తి. రోజులు దగ్గరపడ్తుండేసరికి ఆప్యాయత పెరిగి 'అబ్బాయి' అని సంబోధించాడు.. మామూలుగా అయితే "ఏమండీ" అనో "మిస్టర్" అనో సంబోధించేవాడు.

మిగిలిన ఇద్దరూ ఆ మాటలు విని ఊరుకున్నారు.

కొద్దిసేపటివరకూ ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండిపోయారు.

"ఆ ఉల్క గుద్దుకున్నప్పుడే మన ప్రాణాలు పోయుంటే బాగుండేది. ఇలా సస్పెన్స్‌తో టెన్షన్‌తో గడుపుతూ దిక్కులేని చావు చావడంకంటే" అన్నాడు రావు.

"ఏమో బ్రతికి బయటపడ్తామేమో! ఏదైనా మార్గం గోచరిస్తుందేమో! ఎవరు చెప్పగలరు!" అన్నాడు మధుకర్.

"నాకు అర్థంలేని ఆశావాదులంటే ఒళ్ళుమంట. ఆశ ఏర్పరచుకోవడానికి కూడా అర్థం ఉండాలి." అంటూ చిర్రుబుర్రులాడాడు మూర్తి.

"మనం ఎలాగూ చావక తప్పదు. బ్రతికుండే ఈ రెండుమూడు రోజులూ, సరదాగా జోక్స్ వేసుకుంటూ బతుకుదాం" అన్నాడు రావు.

"మనకున్న సమయం చాలా తక్కువ. అదిప్పుడు ఎంతో విలువైంది. సరదాకబుర్లుమాని బయటపడే మార్గం ఏదన్నా గోచరిస్తుందేమో ఆలోచించడం మంచిది" అన్నాడు మధుకర్ కొంచెం సీరియస్‌గా.

"అదేదో నువ్వే ఆలోచించు' అన్నాడు రావు ముఖం ముడుచుకొని ఇప్పుడు అతన్ని 'నువ్వు' అనడం మొదలుపెట్టాడు.

"నేను ఎలాగూ ఆలోచిస్తాను. మిమ్మల్ని కూడా ఆలోచించమని అడుగుతున్నాను. మీరు ఆలోచించలేకపోతే మిన్నకుండండి., నన్ను డిస్టర్బ్ చేయకండి" అన్నాడు మధుకర్.

నౌక కిటికీలోనుంచి బయటకు చూశాడు మూర్తి.

వెస్టా పౌర్ణమినాడు ఉదయించే చంద్రుడిలాగా పెద్దగా కనిపిస్తోంది.

"వెస్టా బాగా పెద్దగా కనిపిస్తోంది. ఈ లెక్కన మరోవారం పదిరోజుల్లో వెస్టాను చేరవచ్చు మనం" అన్నాడు మూర్తి.

"చేరవచ్చు కాదు -గుద్దుకోవచ్చు- మన శవాలతోపాటు ఈ అంతరిక్షనౌక వెళ్ళి గుద్దుకోవచ్చు" అంటూ వాక్యాన్ని సరిచేశాడు రావు. ఆ తర్వాత గతిని, దిశని చూపించే కంప్యూటర్ దగ్గరికి వెళ్ళాడు. దానిని ఆన్‌చేసి ఏవో రీడింగ్‌లు చూశాడు.

"మైగాడ్" ఉల్క తాకిడి మన అంతరిక్షనౌక గతినీ, దిశనూ మార్చేసింది. మన నౌక ఇప్పుడు

వెస్టాచుట్టూ కక్ష్యలో ప్రవేశించింది. ఇంక దాని ఉపగ్రహంగా శాశ్వతంగా దాని చుట్టూ తిరుగుతూ ఉండిపోతుంది" అన్నాడు రావు ఆందోళనగా.

"హు పెనం మీద నుంచి పొయ్యిలోకి పడ్డట్టయిందన్న మాట మన పని. ఇంతసేపు మననౌక వెళ్ళి వెస్టాని గుద్దుకుంటుందని భయపడ్డాం. ఇప్పుడు ఈ ఉత్పాతంవల్ల అంతరిక్షంలో శవాల మ్యూజియంలామననౌక తిరుగుతూ ఉంటుంది." అన్నాడు మూర్తి బాధతో.

"గుద్దుకునే ప్రమాదం దైవికంగా తప్పిపోయింది. అలాగే దైవికంగా మనం తప్పించుకునే మార్గం కూడా దొరుకుతుందేమో ప్రయత్నం చేద్దాం" అన్నాడు మధుకర్.

"నీ ఆశావాదానికి నా జోహార్లు" అంటూ కిటికీలోనుంచి వెస్టావైపు మరోసారి చూసి తన కుర్చీలో తలపట్టుకు కూర్చున్నాడు మూర్తి.

రావు కూడా ఏమీ మాట్లాడలేదు.

మౌనంగా ఉండిపోయాడు.

కంప్యూటర్ రీడింగ్స్‌ని ముందేసుకుని సీరియస్‌గా ఆలోచించసాగాడు మధుకర్.

రావు చెప్పిన మాట నిజమే. అంతరిక్షనౌక వెస్టాకి ఉపగ్రహంగా మారింది.

అది అలా తిరుగుతూనే ఉంటుంది.

భారంగా నిట్టూర్చి, తల పట్టుకుని దీర్ఘంగా ఆలోచించసాగాడు.

ఆ రోజు ఎవరికీ ఆహారం తీసుకోవాలనిపించలేదు.

భారంగా రోజు గడిచింది.

అంతరిక్ష నౌకలో ఆక్సిజన్ త్వరత్వరగా ఖర్చయిపోతోంది. అందులో ఆందోళనతో మరింత ఎక్కువగా ఊపిరి తీసుకుంటున్నారేమో ఇంకా త్వరగా ఖర్చవుతోంది.

ముగ్గురూ దీర్ఘంగా ఆలోచిస్తున్నా ఎవ్వరికీ, బయట పడడానికి అవకాశం కన్పించే మార్గం ఏదీ స్ఫురించడంలేదు. అందుబాటులో వున్న ప్రాణవాయువు రెండు రోజులు మించిరాదు. ఎట్టి పరిస్థితులలోనూ మూడోరోజు దాటదు. మధుకర్ మళ్ళీ తాజాగా నౌక గతి, దిశలను గురించిన రీడింగ్స్ తీసుకున్నాడు. వాటిని నిశితంగా పరిశీలించాడు. వాటిలో ఏ మార్పులేదు.

నౌక ఖాయంగా ఉపగ్రహంగా మారి వెస్టా చుట్టూ పరిభ్రమిస్తోంది.

మధుకర్ లెక్కలు కట్టాడు.

ఈ కక్ష్యకి లోపలగా కనీసం ఒకటి రెండుకిలోమీటర్లు కనుక నౌక వెళ్ళగలిగితే అది ఆ కక్ష్యనుంచి విడిపడి వెస్టా వైపుగా వెళ్ళిపోతుంది.

అలా జరగాలంటే నౌకకి అవతలివైపున ఏ ఉల్కో వచ్చి గుద్దుకుని గట్టి తాకిడి ఇయ్యాలి.

పెద్ద ఉల్క అయితే నౌక తుక్కుతుక్కు అవుతుంది.

మరీ చిన్నది కాకుండా సుమారుగా ఉండే ఉల్క అయితేనే ఫలితం దక్కుతుంది. కాని ఇలా

కోరుకున్నట్లు జరగడం అసంభవం. జరిగితే అది దైనికమే.

పోనీ ఏదో విధంగా కోరుకున్నట్లుగా నౌకకి తాకిడి ఏర్పడి వెళ్లిందనుకొందాం. కాని ఏం సుఖం? కంట్రోల్ సిస్టమ్‌లేని అది తిన్నగా వెళ్ళి వెస్టాని గుద్దుకుంటుంది. అసలు ఆ తాకిడికి వెస్టాకూడా ముక్కలై అక్కడవున్న స్థావరం కూడా ధ్వంసం కావచ్చు.

అయితే ఈపాటికి భూమిమీదున్న గ్రౌండ్ కంట్రోల్ వాళ్ళు వెస్టా మీదున్న శాస్త్రజ్ఞులూ అంతరిక్ష నౌక నుంచి సమాచారం ఆగిపోవడంతో అది ప్రమాదంలో చిక్కుకుందని గ్రహించి ఉంటారు. దానికోసం అన్వేషణ కూడా మొదలుపెట్టి ఉంటారు. ఎప్పుడైతే వెస్టావైపుగా అంతరిక్ష నౌక దూసుకువస్తూ కంటబడిందో వెంటనే అది ఢీకొనకుండా చేయడానికి ఏదో మార్గం వారికి గోచరించవచ్చు. తగిన దూరానికి రాగానే వెస్టామీదున్న శాస్త్రజ్ఞులు, దాని ఉనికిని తమ టెలిస్కోప్ ద్వారా ఇతర యంత్రాలద్వారా గుర్తించగలరు అని మధుకర్ ఆశ.

అయితే అందువల్ల సుఖం ఏమిటి?

అప్పటికి ఎలాగూ తాము ముగ్గురూ మరణిస్తారు.

శవాలతో ఉన్న ఈ నౌకని రక్షించడంవల్ల ఒనగూడే ప్రయోజనం ఏమి ఉంటుంది? పైగా వారు రక్షించలేకపోతే నౌక గుద్దుకోవడంవల్ల వారి మనుగడకే ముప్పు ఏర్పడుతుందికూడాను. పరిపరి విధాలుగా పోతున్నాయి మధుకర్ ఆలోచనలు. ఉల్క గుద్దుకుని తాకిడి ఇవ్వడం అటుంచి వేరే ఏ విధంగానైనా అటువంటి తాకిడి కల్పించే అవకాశం ఉందా అని తీవ్రంగా ఆలోచించాడు. ఎంత ఆలోచించినా ఏ మార్గమూ స్ఫురించలేదు.

అసహనంగా కుర్చీలోంచి లేచి ఒక్కసారి నౌకలోపల అంతటా కలియ దిరిగాడు.

కిటికీలోనించి చూశాడు.

వెస్టా అదే పరిమాణంలో అలాగే ఉంది.

అంటే నౌక ఉపగ్రహ కక్ష్యలోనే తిరుగుతోందన్నమాట. నౌకలోనుంచి విడిపోయిన భాగంవైపు వెళ్ళాలనిపించింది.

వెంటనే లేచి తలుపు దగ్గరకు వెళ్ళాడు.

మూర్తి, రావు, అతను లేచి వెళ్ళడం చూశారేకాని ఏమీ పట్టించుకోక కుర్చీలలోనే ఉండిపోయారు.

మధుకర్ స్పేస్ సూట్‌ను సరిచేసుకున్నాడు. తలుపు తెరిచి అవతలివైపు ఛాంబర్‌లోకి వెళ్ళాడు. వెనకాలే తలుపులు మూశాడు.

ఎదురుగా ఛాంబర్‌కి రెండువైపులా తలుపులున్నాయి.

అవితీస్తే అంతరిక్ష నౌకలోని రెండోభాగంలోకి వెళ్ళడానికి దారి ఏర్పడుతుంది.

గాలి బయటకు పోకుండా ఉండడం కోసం ఎక్కడికక్కడే ఈ విధమైన ఏర్పాటు ఉంటుంది.

ఇప్పుడు అంతరిక్ష నౌకలోని రెండో భాగం ఊడివెళ్ళిపోయింది. కనుక తలుపులు తీస్తే ఆవలివైపు అంతా శూన్యమే.

మధుకర్ తన నడుముకీ, అంతరిక్ష నౌకకీ కలిపి ఒకతాడు కట్టుకున్నాడు.

జాగ్రత్తగా చాంబర్‌కి అవతలివైపువున్న తలుపులు తెరిచాడు. అవతలి భాగం విరిగిపోయినప్పుడు కొంతభాగం ఉండిపోయింది. అది మెట్టులా ఉండి దానిమీద నిలబడడానికి అనువుగా ఉంది. మధుకర్ జాగ్రత్తగా దానిమీద నిలబడి, తలుపు అంచుల్ని గట్టిగా పట్టుకుని బయట చూశాడు.

అంతా చిమ్మ చీకటి.

అయితే అన్ని వైపులా అమావాశ్యనాటి రాత్రి మెరిసే మిణుగురు పురుగులల్లే నక్షత్రాలు కాంతిమంతంగా మెరుస్తున్నాయి.

సూర్యుడు ఒక ప్రక్కన జాజ్వలంగా మెరుస్తున్నాడు. అయితే సూర్యుని నుంచి సుమారు ఇరవై కోట్ల మైళ్ళ దూరాన ఉండడంతో బింబం చిన్నగా ఉంది. పౌర్ణిమనాటి అర్ధరాత్రి కనిపించే చందమామంత పరిమాణంలో ఉంది సూర్యబింబం. భూమికీ, సూర్యుడికీ మధ్యదూరం తొమ్మిది కోట్ల మైళ్ళే కనుక, ఇక్కడ నుంచి సూర్యుడు పెద్దగా కనిపిస్తాడు. కాని అంగారకుడు ఆ పైన నుంచి బాగా చిన్నగా కనిపిస్తాడు.

ఆ తారకలు సూర్యుడు మరో వైపు బృహస్పతీ, శని ఈ దృశ్యమంతా ఎంతో మనోజ్ఞంగా ఉంది. కాని వాటిని చూసి ఆనందించే సమయమూ, సందర్భమూ కాదది.

తాను నిలబడ్డచోటునుంచి అంతరిక్ష నౌకను అటూ ఇటూ చూశాడు మధుకర్.

చీకట్లో ఏదీ స్పష్టంగా కనిపించలేదు. ఏదో ఆలోచనవచ్చి తిరిగి లోనికి వెళ్ళాడు.

మధుకర్ లోనికివెళ్ళి తలకి హెడ్‌లైట్ పెట్టుకున్నాడు. దానిని ఆన్‌చేసి తిరిగి బయటకు వచ్చాడు. ఆ హెడ్‌లైట్‌ను ప్రసరింపజేస్తూ అంతరిక్ష నౌక బయటి భాగాన్ని నిశితంగా పరిశీలించసాగారు. అంతరిక్ష నౌకనుంచి మొదటి, రెండవ విభాగాలను ఆనుకుని ఎడమప్రక్కగా వాటర్ టాంక్ ఉంది. పది అడుగుల పొడవు, పది అడుగుల వెడల్పు, పది అడుగుల ఎత్తు ఉన్నదాని గోడలు గట్టి మిశ్రమలోహంతో చేయబడి ఉన్నాయి. ఆ గోడలమందం పది అంగుళాలు ఉంది. ఉల్కతాకిడికి ఈ వాటర్‌టాంక్ చెక్కుచెదరలేదు. దానిని అంటివున్న అంతరిక్ష నౌక రెండవ భాగం మాత్రం ఊడి ఎగిరిపోయింది.

ఆ వాటర్ టాంకర్‌ను చూస్తుంటే మధుకర్ మనసులో ఏదో లీలగా మెదలసాగింది. అదేమిటో స్పష్టంగా గోచరం కాలేదు. ఆలోచించగా ఆలోచించగా అకస్మాత్తుగా స్ఫురణకి వచ్చింది.

ఒకసారి మధుకర్ ఫ్రాన్సులో జరిగిన ప్రత్యామ్నాయశక్తి వనరులు అన్న గోష్ఠిలో పాల్గొనేందుకు వెళ్ళాడు. అప్పుడు అతను బాభా అణుశక్తి కేంద్రంలో పనిచేస్తుండేవాడు. ఆ తర్వాత షార్ కేంద్రానికి వెళ్ళాడు. అణుశక్తిని గురించి మాట్లాడటానికి తాను వెళ్ళాడు. ఆ సమావేశానికి వివిధ దేశాలలో వివిధ రంగాలలో కృషి చేస్తున్న శాస్త్రవేత్తలు వచ్చారు.

కొందరు సౌరశక్తిని గురించి, కొందరు పవనశక్తిని గురించి, ఇంకొందరు తరంగశక్తిని గురించి, మరికొందరు భూగర్భ ఉష్ణశక్తిని గురించి వేరే కొందరు చెత్తాచెదారం నుంచి వచ్చే శక్తి గురించి-ఇలా రకరకాలుగా ఉపన్యాసాలు ఇచ్చారు. ఫ్రాన్సులో సముద్రతరంగాలనుంచి లాభసాటిగా శక్తిని ఉత్పత్తిచేసే ప్రక్రియ ఉంది. అక్కడ ఆటుపోటులు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో సముద్రతీరంలో పెద్ద పెద్ద టాంక్‌లు

కట్టారు. అలలు ఉవ్వెత్తుగా వచ్చినప్పుడు అవి ఆ టాంక్‌ని నింపేస్తాయి. టాంక్‌నిండాక టాంక్‌కి క్రిందనున్న తూములను తెరుస్తారు. పైనున్న నీటి ఒత్తిడి మూలంగా, వేగంగా నీరు ఆ తూములలోనుంచి బయటకి వస్తుంది. అది దిగువనవున్న టర్బయిన్‌ల మీదపడి అవి తిరిగి విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆ ప్రక్రియను ఎంతో ఆసక్తితో గమనించాడు మధుకర్. ఇప్పుడు నౌకలోని ఆ వాటర్ టాంక్‌ను చూస్తుంటే, ఫ్రాన్స్‌లో తాను చూసిన వాటర్ టాంక్ గుర్తుకి వచ్చింది. ఆ వాటర్ టాంక్‌లోంచి నీరు చిమ్మన గ్రోని గొట్టంలోంచి వలే వేగంగా బయటకు రావడం కళ్ళముందు మెదిలింది. అలాగే రాకెట్‌ను ప్రేల్చినప్పుడు అడుగునుంచి ఉజ్వలంగా మంట దూసుకువచ్చే దృశ్యం కూడా కనులముందు మెదిలింది. వెంటనే మధుకర్ మస్తిష్కంలో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. అతని ముఖం కాంతితో కళకళలాడింది. వెంటనే వడివడిగా లోనికి వెళ్లాడు.

కంప్యూటర్ దగ్గర కూర్చుని ఏవో వివరాలు దానికి ఫీడ్‌చేసి ఏదో సమాచారం అడిగాడు. అది వెంటనే కావలసిన సమాధానం చెప్పింది. దగ్గర ఉన్న టాప్‌ని తీసుకొని జేబులో పెట్టుకున్నాడు. అతని హడావిడి అంతా చూస్తున్న మూర్తికి, రావుకి ఏమీ అర్థంకాలేదు.

"ఏమిటీ హడావుడి? ఏమైనా ఐడియా వచ్చిందా?" అన్నాడు రావు ఆశగా.

"అప్పుడే ఏమీ చెప్పలేను. నా ఆలోచనకనక సరియైనది అయితే మనం బ్రతికి బయటపడగలం. సరియైనది అయినా కాకపోయినా ఇంక వేరే మార్గంలేదు. మనం ఎలాగూ చావడానికి సిద్ధపడే ఉన్నాం కనుక ఈ ప్రయత్నం చేయాలి. ఫలిస్తే సంతోషం. లేకుంటే అందరికీ గుడ్‌బై" అన్నాడు మధుకర్.

"ఏమిటది?" అన్నాడు రావు

"ఇప్పుడు చెప్పేటైం లేదు. ప్రతినిమిషం మనకిప్పుడు విలువైనదే. ఆ మనదగ్గర డ్రిల్లర్ ఉండాలి. ఉందా?" అని అడిగాడు మధుకర్.

'ఆ ఉంది. ఇదుగో" అంటూ దగ్గరనుంచి తీసి ఇచ్చి "మేమేమైనా సహాయానికి రావాలా?" అని అడిగాడు రావు.

"వస్తే సంతోషమే" అన్నాడు మధుకర్.

"పిచ్చి పిచ్చి ఐడియాలకోసం వళ్ళు విరుచుకోదల్చుకోలేదు. చచ్చేముందైనా తీరిగ్గా ఉండనీ. నేను రాను ఇక్కడే ఉంటాను" అన్నాడు మూర్తి.

"నేను వస్తున్నాను" అంటూ మధుకర్‌ని అనుసరించాడు రావు. ఛాంబర్‌లోని ప్లగ్ పాయింట్‌కి డ్రిల్లర్‌ని తగిలించి చేతిలో తీసుకున్నాడు మధుకర్. హెడ్‌లైట్‌ని ఆన్‌చేసి, జేబులోని టేప్‌తీసి కొలతలు వేసి వాటర్ టాంక్‌కి ఇవతలివైపు గోడమీద, డ్రిల్ చేయవలసిన చోటుని మార్క్‌చేసాడు. అతను కొలతలు వేస్తున్నంత సేపూ రావు డ్రిల్లర్‌ని చేతపట్టుకు నిలబడ్డాడు. నడుముకి తాడుకట్టుకొని రెండో కొసని ఛాంబర్ గోడకి బిగించాడు మధుకర్ బలంగా ఆ డ్రిల్లర్‌ని టాంక్ గోడకి అదిమిపెట్టి డ్రిల్ చేయసాగాడు.

కాని ఇంచుమించు అడుగు మందం ఉన్న గోడకీ రంధ్రం పడడం అంటే మాటలా! డ్రిల్లర్ బర్, బర్‌మని శబ్దం చేస్తోందేకాని లోనికి చొచ్చుకుపోవడంలేదు. నిలబడడానికా సరియైన చోటులేదు. కేవలం

అవతలి ఛాంబర్‌లో విరిగిపోగా మిగిలిన మెట్టువంటిదానిమీద నిలబడి ఈ క్లిష్టమైన పనిని చేయాలి. అసలే మానసికంగానూ, శారీరకంగానూ చాలా అలిసిపోయి ఉన్నాడు. అటువంటి సమయంలో ఇబ్బందికరమైన పరిస్థితులలో, క్లిష్టమైన కార్యం చేయడంతో కొంచెం సేపటికే విపరీతమైన అలసట వచ్చింది. దానికి తోడు ఒంటిమీదున్న స్పేస్ సూట్‌కూడా చాలా ఇబ్బందికరంగా ఉంది.

మధుకర్ పరిస్థితినంతా గమనిస్తున్నాడు రావు. "కొంచెంసేపు నేను డ్రిల్ చేస్తా. నువ్వు ఇవతలకి రా" అంటూ ముందుకి వెళ్ళాడు రావు.

అంతే 'కెవ్వు'మని కేకవేస్తూ శూన్యంలోకి పడిపోయాడు. చేతిలోని డ్రిల్లర్‌ని క్రిందికి వదిలేసి తానూ శూన్యంలోకి దూకాడు మధుకర్. ఈతరానివాడు పడ్డే పైకీ క్రిందకీ పల్టీలు కొట్టినట్లు శూన్యంలో పడి కొట్టుకుంటున్నాడు రావు. అతను పడ్డప్పటి ఊపు వేగం ముందుకి నెట్టుంటే అంతరిక్ష నౌక ఆకర్షణశక్తి దగ్గరికి లాగుతుంటే మధ్యలో అటూ ఇటూ ఊగుతున్నాడు. ఆ కటిక చీకటిలో అతను కనిపించేవాడు కాదు. కాని అతని నుదుటిమీద కూడా హెడ్ లైట్ ఉండడంతో ఎక్కడ ఉందీ తెలిగ్గా గుర్తుపట్టడం సాధ్యం అయింది.

స్విమ్మింగ్‌పూల్ గట్టుమీదనుంచి నీటిలోకి దూరంగా గెంతినట్లు తానున్న మెట్టుమీదనుంచి శూన్యంలోకి ఒక గెంతు గెంతాడు మధుకర్. అతని నడుముకి తాడు ఉంది కనుక భయంలేదు. ఆ శూన్యంలోనే కాళ్లూ చేతులూ విదిలిస్తూ ముందుకి సాగి కొంచెం సేపట్లో రావుని సమీపించాడు. అతనికి తన చేయి అందించాడు. రావు పట్టుకున్నాడు. వెంటనే వెనుదిరిగి నడుముకి ఉన్న తాడును బలంగా లాగుతూ నౌకని సమీపించారు ఇద్దరూ. నెమ్మదిగా మెట్టుఎక్కి ఛాంబర్‌లోకి ప్రవేశించారు. రావు కొంచెం తేరుకున్నాక "నీవు విశ్రాంతి తీసుకో నేను ఒక్కడ్నీ చూసుకుంటాను"అన్నాడు మధుకర్.

"ఏం ఫర్వాలేదు నేనుకూడా నడుముకి తాడు కట్టుకుంటాను" అన్నాడు రావు.

"సరే ముందు కొంచెం సేపు విశ్రాంతి తీసుకుందాం" అంటూ టాంక్‌వైపుకు వెళ్లి ఆ డ్రిల్లర్‌ని పైకి తీసాడు.

"మైగాడ్ దీని మొన విరిగిపోయింది. ఫినిష్" అంటూ తలపట్టుకున్నాడు మధుకర్.

"అరే...అదెలా జరిగింది? టాంక్ గోడమందం మరీ ఎక్కువగా ఉండడం వల్ల విరిగిపోయి నట్టుంది" అన్నాడు రావు.

"అదేం కాదు నేను కంగారుగా డ్రిల్‌ని క్రిందికి పడేసాను. అందువల్ల విరిగిపోయింది" అన్నాడు మధుకర్.

"అరే... ఇదంతా నామూలంగా జరిగింది. నేను తొందరపడకుండా జాగ్రత్తగా వచ్చిఉంటే ఇలా అయ్యేది కాదు"అన్నాడు రావు బాధపడ్తూ.

"నువ్వు మంచి ఉద్దేశంతోనే వచ్చావు. అయినా ఇలా జరిగితే అందుకు ఎవరేం చేస్తారు? ఇది మన దురదృష్టం" అన్నాడు మధుకర్.

"ఇప్పుడు ఏమిటి చెయ్యడం?" అన్నాడు రావు దిగులుగా.

"ముందు లోపలికి పోయి విశ్రాంతి తీసుకుందాం. భోజనం చేసి ప్రశాంతంగా ఆలోచించి ఏం చేయాలో నిర్ణయిద్దాం" అన్నాడు మధుకర్.

ఇద్దరూ లోనికి వెళ్ళారు. మూర్తి మానసికమైన అలసటవల్లనో, దిగులుతోనో, కుర్చీలో మగతగా కళ్ళుమూసుకుని కూర్చున్నాడు. ఆయనని లేపి ఈ విషయం అంతా చెప్పడం అనవసరం అనిపించింది. ఆహారం తీసుకోడానికి ఏర్పాటు చేస్తుండగా మూర్తికి మెలుకువ వచ్చింది.

ముగ్గురూ ఆహారం తీసుకున్నాక "రావుకి ఈ రోజు పెద్ద గండం తపిపంది" అంటూ జరిగింది చెప్పాడు మధుకర్. మూర్తి నిర్లిప్తంగా నవ్వాడు.

"పోయివుంటే మనకంటే ఒకటి రెండు రోజులు ముందుగా పోయి ఉండేవాడన్నమాట. చావును ముందుపెట్టుకొని ఒక గండం గడిచిందని మురిసిపోతే ప్రయోజనం ఏమిటి?" అన్నాడు.

రావు, మధుకర్ ఏమీ మాట్లాడలేదు.

తర్వాత ఎవరి సీట్లలో వారు కూర్చుని విశ్రాంతి తీసుకోసాగారు.

మధుకర్ అయితే తీవ్రంగా ఆలోచించసాగాడు.

కొంచెం సేపటికి ఉన్నట్లుండి లేచి "రావ్..మన దగ్గర గాస్ కట్టర్ ఉందిగా?" అన్నాడు.

"ఆ.... ఉంది..." అంటూ తీసి ఇచ్చాడు రావు.

వెంటనే దానిని తీసుకుని బయలేదేరాడు మధుకర్.

ఛాంబర్ దాటి, మెట్టుమీద జాగ్రత్తగా నిలబడి గాస్ లైటర్‌ను ఆన్ చేశాడు.

నాజిల్‌లో నుంచి ముందుగా ఎర్రని, తర్వాత తెల్లని, ఆ తర్వాత నీలం మంట వచ్చింది. ఆ మంటతో మార్కు చేసిన చోట కాల్చాడు.

అది ఎంతో దట్టమైన గోడ. పైగా ప్రత్యేకమైన మిశ్రమ లోహాలతో చేసినట్టిది. ఎంత వేడి ఉన్న మంటను పంపినా అది కరగడం లేదు.

పదినిమిషాలు అయింది.

ఇరవై నిమిషాలు గడిచింది.

అరగంట దాటింది.

అయినా ఆ గోడకి ఏమీ చలనం ఉన్నట్లనిపించడం లేదు. గాస్ ఫ్లేమ్‌లో లోపం ఉందనుకోవడానికి లేదు. స్పేస్ దుస్తులు ఉన్నా కూడా దాని వేడి వంటికి తగులుతున్నట్లనిపిస్తోంది. నిరాశతో నిస్పృహతో నీరసం వచ్చేస్తోంది.

మధ్యలో ఒకసారి రావు వచ్చి కొంత సేపు కట్టర్‌ని పట్టుకున్నాడు. అయినా చలనం లేదు.

"లాభం లేదు మధుకర్. ఈ గోడ ప్రత్యేక లోహాలతో చేయబడింది గదా! అది కరగడానికి ఈ వేడి చాలదని తెలుస్తోంది. వృధా..... మన శ్రమంతా వృధా" అన్నాడు రావు బాధగా.

"చూద్దాం మరి కొంచెం సేపు చూద్దాం" అంటూ తిరిగి తాను ఆ కట్టర్‌ని తీసుకున్నాడు మధుకర్.

ఐదు నిమిషాలు గడిచింది.

మార్క్ చేసిన చోట ఎర్రని మచ్చ ఏర్పడింది.

చూస్తుండగా అది మరింత ప్రకాశవంతం అవుతూ చుట్టూరా వ్యాపించసాగింది.

మధుకర్ ఆనందానికి అవధి లేదు.

చివరికి అది పనిచేస్తోంది. "సక్సెస్" అని బిగ్గరగా అరిచాడు.

మరి కొద్ది నిమిషాలలో ఒక గుండ్రటి బిళ్ళ ఊడి శూన్యంలోకి పడిపోయింది.

పెద్ద శబ్దంతో ఆ రంధ్రంలోంచి నీరు బయటకు ధారగా అమిత వేగంతో వచ్చింది.

అయితే వచ్చీ రాగానే శూన్యంలో ఉన్న చల్లదనానికి మంచుగడ్డలుగా మారి తిరిగి ఆ ముక్కలు ఎటో పోతున్నాయి. ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

"పద మన పని అయింది" అంటూ గాస్ కట్టర్‌ని ఆఫ్‌చేసి ఇవతలకు వచ్చాడు మధుకర్.

ఇద్దరూ లోనికి వెళ్ళారు.

అప్పటికి సుమారు పది నిమిషాలు గడిచింది.

మధుకర్ గతి, దిశను తెలిపే యంత్రం రీడింగ్స్ చూశాడు.

సందేహం లేదు. అంతరిక్షనౌక కక్ష్యలోంచి బయటపడినట్లు వేగం పుంజుకుంటూ వెస్టా దిశగా వెళ్తున్నట్లు అది చూపింది. నౌకకి స్వతహాగా ఉన్న వేగం, నీటి ధార ముందుకి నెట్టున్నవేగం, వెస్టా ఆకర్షణ శక్తి ఈ మూడు కలిపి అంతకంతకీ వేగాన్ని పుంజుకుంటూ అది వెళ్తోంది.

సంతోషం పట్టలేక అరుపులూ చప్పట్లూ మొదలుపెట్టారు ఇద్దరూ. ఆ అలికిడికి లేచి కూర్చుని ఏమి జరిగింది?" అన్నాడు మూర్తి కంగారుగా.

జరిగింది చెప్పారు ఇద్దరు.

"అసలు నీకి ఐడియా ఎలా వచ్చింది?" అన్నాడు రావు.

"ఇందులో ఉన్నది రాకెట్‌లో ఉన్న సూత్రమే. రాకెట్‌ని పేల్చినపుడు మంట ఎటువైపు వస్తుందో దానికి వ్యతిరేక దిశలో రాకెట్ వెళ్తుంది. ఇది క్రియ-ప్రక్రియ (యాక్షన్ అండ్ రియాక్షన్) అన్న మాట. అదేవిధంగా వేగంగా నీటి ధార బయటకు వచ్చినప్పుడు దానికి వ్యతిరేక దిశలో ఒత్తిడి ఉంటుంది. అయితే వాటర్ టాంక్‌లు నేలలో బిగించి కట్టాం కనుక అవి కదలవు. అంతరిక్ష నౌకకి ఉన్న వాటర్ టాంక్ స్థిరంగా లేదు కాబట్టి దానికి కలిగిన ఒత్తిడి దానిని దానితో పాటు మొత్తం అంతరిక్ష నౌకనీ వ్యతిరేక దిశలో నెట్టుంది. మన వాటర్ టాంకర్‌ను చూసినపుడు ఫ్రాంసులో సముద్ర తీరాల్లో కట్టిన వాటర్ టాంక్‌లు వాటి నుంచి నీటి ధారలు వెలువడుతుండడం నాకు గుర్తుకి వచ్చింది. అదే సమయంలో రాకెట్‌ని పేల్చేటప్పుడు జ్వాలలు రావడం దానికి వ్యతిరేక దిశలో రాకెట్ వెళ్ళడం జ్ఞప్తికి వచ్చింది. ఈ రెండింటిలోనూ ఇమిడి ఉన్న సూత్రం ఒకటేనని స్ఫురించింది. వెంటనే అందుకు పూనుకున్నాను. రావు సహకారంతో పూర్తి చేశాను అని వివరించాడు మధుకర్.

"అంతా బాగానే ఉంది. కాని ఏం ప్రయోజనం? ఇప్పుడిది వేగంగా వెళ్ళి వెస్టాను గుద్దుకుని ముక్కలు ముక్కలవుతుంది. ఇంత శ్రమా వృధా అన్నాడు మూర్తి దిగులుగా.

"అదేంకాదు ఏ సూత్రం మనల్ని ఇప్పుడు కాపాడిందో అదే సూత్రం అప్పుడూ రక్షిస్తుంది" అన్నాడు మధుకర్.

"ఎలా?" అన్నాడు రావు ఆశ్చర్యంగా.

"మన నౌక వేగం పుంజుకుని వెస్టా వైపు వెళ్తోంది కనుక ఇంక దానికి నీటి ధార వల్ల కలిగే తోపుడు అనవసరం. వెస్టా ఆకర్షణ శక్తే దానికి చాలు. అందువల్ల మనం వెంటనే ఒక రేకు తీసుకుని చేసిన కన్నాన్ని వెల్డ్ చేసి పూడ్చేయాలి. ఇలా చేయడం వల్ల నీరు వృధా కాదు. తర్వాత ఇప్పుడు రంధ్రం చేసిన దానికి సరిగ్గా ఎదురువైపు అంటే వెస్టావైపు మరో రంధ్రం చేసి నీటిని వదలడానికి సిద్ధంగా ఉంచాలి. మన నౌక వేగం, వెస్టా ఆకర్షణ శక్తులను బట్టి ఏ సమయంలో ఎంత దూరంలో ఈ నీటిధారను వదలాలో కంప్యూటర్‌కి ఫీడ్ చేసి తెలుసుకోవాలి. సరిగ్గా ఆ సమయానికి రెండో రంధ్రాన్ని తెరిచి నీటిని వదలాలి. ఈ ధార వెస్టా వైపు ఉంటుంది కనుక నౌక దానికి వ్యతిరేకంగా వెళ్లాలని ప్రయత్నిస్తుంది. అయితే వెస్టా ఆకర్షణ ఈ త్రోపుడు శక్తికంటే కొంత ఎక్కువగా ఉండేటట్లు చూసుకుంటాం కనుక నౌక వేగం బాగా తగ్గి నెమ్మది నెమ్మదిగా వెస్టా మీద దిగుతుంది. అంటే ఈ వాటర్ టాంకే రెట్రో రాకెట్‌లాగా పని చేస్తుందన్నమాట" అని వివరించాడు మధుకర్.

"శభాష్" అంటూ ఉషారుగా కుర్చీలోంచి లేచి మధుకర్ భుజం చరిచాడు మూర్తి. అంతటి ఉత్సాహం కనిపించడం ఆయనలో అదే మొదటిసారి.

"రావ్...పద రంధ్రం వెల్డ్ చేద్దాం" అంటూ లేచాడు మధుకర్.

"ఉండండి. నేనూ వస్తాను" అంటూ గాస్ కట్టర్‌ను తీసుకున్నాడు మూర్తి.

తగిన రేకుని వెతికితీసుకు వచ్చాడు రావు.

మరో నలభై నిమిషాలలో వెల్డింగ్ కార్యక్రమం పూర్తయింది. ఆ తర్వాత వాటర్ టాంక్ అవతల వైపుకి వెళ్ళి ఒక గంట సేపు కష్టపడి రంధ్రం చేశారు.

అందులోని నీరు బయటికి పోకుండా గట్టిమూత పెట్టారు. పని అంతా సవ్యంగా అనుకున్నట్లు జరిగాక తృప్తిగా లోపలికి వచ్చారు ముగ్గురూ.

కిటికీలోంచి చూస్తూ "మధూ....రావ్...అటు చూడండి. వెస్టా ఎంత పెద్దగా కనిపిస్తోందో! అని అరిచాడు మూర్తి.

"అవును మనం దగ్గరకి వచ్చేస్తున్నాయన్నమాట" అన్నాడు రావు మధుకర్ బిజీగా కంప్యూటర్‌కి ఫీడింగ్ ఇయ్యసాగాడు. అది ఏ సమయంలో రెండో రంధ్రాన్ని వదలాలో చూపించింది. మరి కొన్ని గంటలలో ఆ సమయం రానే వచ్చింది. వెంటనే వెస్టా వైపున ఉన్న వాటర్ టాంక్ గోడ రంధ్రాన్ని తెరిచారు.

ఒక్కసారి కాలర్ పుచ్చుకుని పైకి ఎవరో గుంజినట్లనిపించింది ముగ్గురికీ.

వేగంగా వెళ్తున్న నౌకకి సడన్‌గా బ్రేక్ పడ్డట్టు అవడంతో ఆ అనుభూతి కలిగింది.

తర్వాత - అంతరిక్ష నౌక నెమ్మదిగా ప్రయాణం మొదలుపెట్టింది. వీటి మీద తేలియాడుతున్న హంసలాగా నెమ్మదిగా దిగుతున్న పారాచూట్ లాగ, అతి నెమ్మదిగా వెస్టామీద దిగింది.

ఆకాశంలో తగు దూరంలో ఉండగానే అంతరిక్ష నౌక వస్తున్న విషయం గ్రహించారు. వెస్టా మీదున్న శాస్త్రజ్ఞులు అయితే ఏ విధమైన రేడియో సందేశం లేకపోవడంతో చాలా అందోళనతో దాని రాకకోసం ఎదురు చూడసాగారు. అంతరిక్ష నౌక సురక్షితంగా వెస్టా మీద దిగి అందులోంచి ముగ్గురు యాత్రికులు సజీవంగా వెలికి రావడంతో వారి సంభ్రమానందాలకు అవధులు లేవు.

మధుకర్ దిగుతూనే వాటర్ టాంక్‌కి చేసిన రంధ్రాన్ని వెంటనే పూడ్పించవలసిందిగా అక్కడి శాస్త్రజ్ఞులకు చెప్పాడు. ఎందుకంటే అందులో ఉన్నది అమూల్యమైన నీరు. దానిని వెస్టామీదున్న శాస్త్రజ్ఞులకోసం తెచ్చారు. అది పోయిందంటే తిరిగి కొత్త నౌక వచ్చే వరకూ వీటికి కటకటే. ఇప్పటికే అంతరిక్షంలోకి చాలా పోయింది. మొత్తం పోతే ఇంక చెప్పేదేముంది.

మధుకర్‌కీ, మూర్తికీ, రావుకీ ఘనస్వాగతం ఇచ్చారు. వెస్టామీదున్న శాస్త్రజ్ఞులు వారు క్షేమంగా వచ్చిన విషయం వెంటనే భూకేంద్రానికి తెలియజేశారు వైర్లెస్‌ద్వారా. భూకేంద్రం వారికి, భారత ప్రజలకు యావత్ ప్రపంచానికి వర్ణింపనలవికాని ఆనందం కలిగింది.

మరో గంటలో భూమి నుంచి సందేశం వచ్చింది.

భారత ప్రధాని స్వయంగా ఈ యాత్రికులతో మాట్లాడాలనుకుంటున్నారట.

ఆ వార్త విని ఆనందంతో ఉక్కిరి బిక్కిరయిపోయారు వారు. అంతలో ప్రధాని లైన్‌లోకి వచ్చారు.

"మైడియర్ హీరోస్. మిమ్మల్ని చూసి నేను, మన దేశ ప్రజలు ఎంతైనా గర్విస్తున్నాం. భారత శాస్త్రవేత్తలు మేధస్సులోనూ, శౌర్య, ధైర్యాలలోనూ ఎవరికీ తీసిపోరని మీరు ప్రపంచానికి చాటిచెప్పారు. మీరాకకోసం దేశ ప్రజలందరు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు" అని ముగ్గురితోనూ ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ తర్వాత మధుకర్‌ని మళ్ళీ ప్రత్యేకంగా పిలిచి అద్భుతమైన మేదస్సుతో అందరి ప్రాణాలను కాపాడి జాతి కీర్తిని ఇనుమడింపజేసిన మిమ్మల్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. దేశంలో అత్యున్నత బిరుదాన్ని అలాగే మీ రంగంలో అతి ప్రముఖ పదవిని మీకు ఇయ్యవలసిందిగా రాష్ట్రపతికి సిఫారసు చేస్తున్నాను..." అన్నారు.

"థాంక్యూ ఆనరబుల్ ప్రైమ్‌మినిస్టర్...థాంక్యూ ఫర్ యువర్ కైండ్‌నెస్" అంటూ గట్టిగా అరవసాగాడు మధుకర్.

"ఏమిట్రా మధూ...ఏమన్నా కలగన్నావా?" అంటూ కొట్టి కొడుకుని నిద్రలేపింది రాజ్యలక్ష్మమ్మగారు.

కంగారుగా లేచి అటూ ఇటూ చూస్తూ "రావు, మూర్తీ ఏరీ?" అన్నాడు.

"వాళ్ళు ఇక్కెడెందుకుంటార్రా, వాళ్ళింట్లో ఉంటారు. ఇది మనిల్లు" అంటూ నవ్వారు అటు వస్తున్న గోపాలరావుగారు.

"అన్నయ్యా...ఏం కలగన్నావురా?" అంటూ దగ్గరికి వచ్చారు తమ్ముళ్లూ, చెల్లెళ్ళు.

"చెప్తాను భలే కల వచ్చింది" అంటూ లేచి త్వరగా ముఖం కడుక్కుని వచ్చి కాఫీ తాగుతూ

మొత్తం కల చెప్పాడు.

"ఇది నాకు కల అనిపించడం లేదు. మొత్తం అంతబాగా గుర్తుండిపోయింది" అన్నాడు.

"భేష్ నీకు నచ్చింది కలే అయినా ప్రతీదీ చాలా తార్కికంగా చేశావు. ఇన్నాళ్ళు నువ్వు చదువుతున్న సైన్స్ పత్రికలు, పుస్తకాలు, సైన్స్ నవలలు, నీమీద ఇటువంటి ప్రభావం చూపించాయన్నమాట" అన్నారు నాన్న.

"అపోలో-13 సినిమా చూశాక అది నా మనసులో బాగా ఉండిపోయింది. చిత్రం అయ్యాక వెస్టా మీద స్థావరాన్ని ఏర్పరచే ప్రయత్నాలు జరుగుతున్నాయని కామెంటేటర్ చెప్పాడు. ఇవన్నీ కలిసి నాకు ఇటువంటి కల వచ్చిందన్నమాట. మూర్తికీ, రావుకి కూడా స్పేస్ సైన్స్ అంటే ఇష్టం. అందుకే మేం ముగ్గురం ఇందులో పాత్రలు అయ్యాం అయితే ఒకటి. అపోలో-13 యాత్రికులు వాస్తవంగా ఎంత వేదననీ, టెన్షన్‌నీ అనుభవించారో తెలియదుకాని కలలోనైనా నేను అంతకి అంతా అనుభవించాను. కలలో నేను చూసిన పరిష్కారం కూడా ఏదైనా సైన్స్ కథలో చదివానేమో... ఇంక అంతరిక్షం, వెస్టా అన్నీ కళ్ళకి కట్టినట్లున్నాయి" అన్నాడు మధు ఆనందంతో.

"ఇంక లే నాయనా...కాలేజీకి టైము అవుతోంది. కలలోనైనా అంతరిక్షయానం చేశావు. అదృష్టవంతుడివి" అన్నారు గోపాలరావుగారు.

"మధూ" అంటూ వచ్చారు మూర్తీ, రావు.

"అదుగో మిగిలిన ఇద్దరు హీరోలూ వచ్చారు" అన్నారు గోపాలరావుగారు నవ్వుతూ.

"హలో!" అంటూ నోళ్ళు వెళ్ళబెట్టారు వాళ్ళు.

"అదేమిటో నేను చెప్తాలేరా ఉండండి. ఐదు నిమిషాల్లో అన్నంతిని వచ్చేస్తాను" అంటూ చర్రునలోనికి వెళ్ళాడు మధు.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, జనవరి 1989** ✪